batukammanews.com TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

19 ఆగస్టు 2026
బుధవారం

## ఏసీబీకి చిక్కిన అటవీశాఖ అధికారులు



వెబ్ డెస్క్, బతుకమ్మ :నల్లమల నుంచి కలప అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తుల కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు లంచం తీసుకుంటున్న అటవీ శాఖదికారులు ఏసీబీ అధికారులకు చిక్కారు. కలప స్మగ్లర్లు అటవీ ప్రాంతం నుంచి అక్రమ రవాణా చేస్తుండగా నాగర్ కర్నూల్ జిల్లా లింగాల అటవీ రేంజ్‌కు చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాంబాబు, బీట్ ఆఫీసర్ మురళి కృష్ణ లు కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు రూ. 1,20,000 లంచం డిమాండ్ చేసారు.

02

## గీత, చేనేత కార్మికులకు

# సాచ్యురేషన్ పెన్షన్‌లు

సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, బతుకమ్మ:రాష్ట్రంలో గీత, చేనేత కార్మికులకు సాచ్యురేషన్ స్థాయిలో పింఛన్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటిం చారు. ట్యాంక్‌బండ్ పైన ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం వారి చిత్రానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ధనసరి అనసూయ సీతక్క ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి గరేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. అర్హులైన నేత, గీత కార్మికులు ఎంతమంది ఉన్నా అందరికీ సంతృప్త స్థాయిలో పింఛన్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాను అని గుర్తుచేశారు. గౌడ సోదరులకు 50 వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేశాం.

02



## లింగ నిర్ధారణ పరీక్షలపై

# ఉక్కుపాదం మోపాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా




02

నిజామాబాద్ అర్బన్ , బతుకమ్మ : పుట్టబోయే శిశువు అమ్మాయా, అబ్బాయా అని తెలియజేసేందుకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. పుట్టబోయేది ఆడ శిశువు అని నిర్ధారణ చేసి, గర్భవిచ్ఛిత్తికి పాల్పడడం క్షమించరాని నేరమని, ఇది ఎంతో శోచనీయమని అన్నారు. ఈ తరహా చర్యలకు పాల్పడే వారిని ఎంతమాత్రం ఉపెక్షించకుండా ,బాధ్యులపై ఎం.టి.పి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.

## సిపి సాయి చైతన్యకు అభినందనలు తెలిపిన

# స్పెషల్ పిపి దయాకర్ గౌడ్



నిజామాబాద్ లీగల్, బతుకమ్మ లిఫేమ్ ఇండియా -ఆసియా సర్వేలో ఉత్తమ పోలిసింగ్ కనబరచిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు నిజామాబాద్ రెండవ అదనపు జిల్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దయాకర్ గౌడ్ మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ను కలిసి పూలగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో పట్టువిడుపులు లేకుండా కృషి చేశారని దయాకర్ గౌడ్ అన్నారు. నేరమయ సంస్కృతిని రూపుమాపడంలో కాని సైబర్ నేరాలను అదుపు చేయడంలో ఉత్తమ పోలిసింగ్ నిర్వహించారని అన్నారు. ఫేమ్ ఇండియా ఆసియా టాప్ టెన్ లో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య కు చోటుతో లభించడం జిల్లాకు గర్వకారణమని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు.పోలీస్ కమిషనర్ మరిన్ని సర్వేలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని గౌడ్ అన్నారు.

# పేదల కోసం భూలక్ష్మి పథకం

- మేము అధికారంలోకి రాగానే ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తాం
- రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ భూ పంపిణీ జరగాలి
- పేదలకు భూములు పంచాల్సింది పోయి వారి అసైన్డ్ భూములను లాక్కుంటున్నారు
- రాష్ట్రంలో రేవంత్ రాక్షస రాజ్యం (ఆర్ఆర్ఆర్) నడుస్తోంది
- రేవంత్ రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం..
- అమలు చేసేది ఆటవిక న్యాయం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

07




హైదరాబాద్, బతుకమ్మ: తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ భూ పంపిణీ కార్యక్రమం జరగాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపు

# పాశవిక చర్య

రేవంత్ మెప్పు కోసం పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించొద్దు.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02



బతుకమ్మ



# గీత చేనేత కార్మికులకు సాచ్యురేషన్ పెన్షన్లు



ప్రమాదవశాత్తు గౌడ సోదరులు చనిపోతే 5 లక్షల రూపాయల పరిహారం చెల్లిస్తున్నాం" అని చెప్పారు గీత కార్మికుల వృత్తిని కాపాడటానికి నీటి పారుదల ప్రాజెక్టుల కాలువల గట్లపైన ఈత, తాటి చెట్లను నాటాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కి సూచించారు."దొరలు, భూస్వాములు, పెత్తందార్లపై పోరాటం సాగించిన యోధుడు, ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం పండుగ సాయన్న పోరాటం, పౌరుషం పాలమూరు జిల్లాలో అందరికీ తెలుసు. అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది" అని ముఖ్యమంత్రి ప్రకటించారు."గీత కార్మికులు, గౌడన్నలు ఎంతో కాలంగా సర్దార్ సర్వాయి పాపన్న గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్న నేపథ్యంలో నేనే స్వయంగా నెక్లెస్ రోడ్ చౌరస్తాకు వెళ్లి స్థలాన్ని పరిశీలించి జ్యోతిరావు పూలే దంపతులకు విగ్రహం ఉండాలని స్థలాన్ని ఎంపిక చేశాను., సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తి ప్రజలకు తెలియాలన్న ఉద్దేశంతో ట్యాంక్ బండ్ పర్యాటక శాఖ కార్యాలయాన్ని మరోచోటికి తరలించి ఆ స్థలంలో పాపన్న విగ్రహం ఏర్పాటు చేసుకున్నాం. హైదరాబాద్ సందర్శనకు వచ్చే పర్యాటకులు, గణేష్ నిమజ్జన సమయంలో ట్యాంక్ బండ్ నుంచి ఎవరు వెళ్లినా ఒక స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశాం" అని వివరించారు.సర్వాయి పాపన్న ఒక కులానికి, కుటుంబానికి కాదు. బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న. బహుజనులతో కలిసి దండయాత్ర చేసి గోల్కొండ కోటపై జెండాను ఎగురవేశారు. ఆయన స్ఫూర్తి ఎప్పటికీ తెలంగాణ ప్రజలకు ఉండాలి.ఇది బహుజనుల తెలంగాణ. సామాజిక న్యాయం, జీవించడానికి స్వేచ్ఛ ఇందిరమ్మ పాలనలో ఉందని నిరూపించాం. మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారో, తెలంగాణలో బహుజనులు కూడా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి అంతే ప్రాధాన్యత ఇస్తారు. బహుజనుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు కాబట్టే ఆయనకు ఆ కీర్తి, గౌరవం దక్కింది" అని గుర్తుచేశారు. కులవృత్తిని కొనసాగించండి. గౌరవించండి. కానీ పిల్లలను మాత్రం చదివించండి. పిల్లల తలరాతలను మార్చే శక్తి మన చేతుల్లో ఉంది. పిల్లలను చదివించి వారు ఉన్నతస్థానానికి చేరుకుని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేయాలి" అని పిలుపునిచ్చారు. విద్యార్థుల కోసం ఎన్ని నిధులైనా కేటాయిస్తాం. నాణ్యమైన విద్యతో పాటు భోజనం కూడా ఇస్తాం. గతంలో సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టలేదు. మా ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యంతో భోజనం పెడుతున్నాం. నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నాం. పాలు, రాగిజావ పిల్లలకు ఇస్తున్నాం.మన పిల్లలు రాజ్యాలు ఏలాలంటే చదువు ఒక్కటే పరిష్కారం. కష్టమైనా, నష్టమైనా పిల్లలను బడికి పంపించాలి. వాళ్లను చదివించే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. ఏటీసీల్లో చేరేవాళ్లకు నెలకు 2 వేల రూపాయల ఉపకార వేతనం ఇస్తున్నాం. ఈ ప్రభుత్వం సామాజిక న్యాయం కోసం పనిచేస్తుంది. సామాజిక న్యాయం కోసం రాష్ట్రంలో బీసీ కులగణన చేశాం. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేశాం. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నాం" ముఖ్యమంత్రి చెప్పారు.

# 22ఎకు సంబంధించి 24గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు చేశాం

**తప్పును ఒప్పుకొని సరిదిద్దుతున్నాం**

**ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు**

**సామాన్య ప్రజల హక్కులు, ఆస్తులకు పూర్తి రక్షణ కల్పించే బాధ్యత మాది**

**15 రోజుల పాటు రోజువారీగా దరఖాస్తుల పరిశీలన**

**మీడియాతో రెవెన్యూ మంత్రి పొంగులేటిశ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్, బతుకమ్మ : ఇది పేదల ప్రభుత్వం. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆధ్వర్యంలో పేదల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పేదవాడికి అన్యాయం చేయదని . పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా ఈ ప్రభుత్వం తీసుకోదని వారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.... 22ఏ నిషేధిత జాబితా వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరోమారు స్పష్టం చేస్తూ సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని 24 గంటల్లోనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 మొత్తం 34 రిజిస్ట్రేషన్లు జరిగాయని మంత్రి వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతోందని తెలిపారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా పొరపాటును పారదర్శకంగా అంగీకరించి . అదే సమయంలో జరిగిన తప్పును సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకున్నామని ప్రజలను ఇబ్బందుల్లో వదిలేసే ప్రభుత్వం తమది కాదని స్పష్టం చేశారు.వివిధ జీవోలు, మెమోల ద్వారా గత ప్రభుత్వాల కాలంలో క్రమబద్ధీకరించబడిన ప్రైవేట్ భూములు, హైకోర్టు మరియు జీహెచ్ఎంసీ/హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు ఆన్‌లైన్ అప్‌లోడింగ్‌లో సాంకేతిక లోపం కారణంగా 22ఏ జాబితాలోకి వచ్చాయని మంత్రి వివరించారు.ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే గుర్తించిందని, బాధితులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని తెలిపారు.22ఏ సమస్యల త్వరిత పరిష్కారం కోసం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ రోజువారీగా దరఖాస్తులను పరిశీలించి . జెన్యూన్ ప్రైవేట్ ఆస్తులన్నింటినీ తక్షణమే క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇప్పుడు పేదవాడి సమస్యను రాజకీయంగా వాడుకోవడం మానేయండి. ఇది పేదల ప్రభుత్వం.. పేదల ఆశీస్సులతో వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం. పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యాయం జరగనివ్వం. మేం తప్పును ఒప్పుకుని దిద్దుతున్నాం.. మీరు చేసిన తప్పులను ఒప్పుకునే ధైర్యం మీకుందా?" అని ప్రశ్నించారు. అబద్ధాలు, ఆరోపణలు, రాజకీయ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. తప్పు జరిగితే దాన్ని అధికారుల మీదకు నెట్టేసి చేతులు దులుపుకోవడం తమ ప్రభుత్వ విధానం కాదని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పొరపాటును అంగీకరించామన్నారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపు పాశవిక చర్య

హైదరాబాద్, బతుకమ్మ : తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే తొలగించడం ద్వారా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరోసారి తన పాశవికత్వాన్ని నిరూపించుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సంపేట గడ్డపై పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం నిలబడితేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నాయని, అందుకే పోలీసులను ఉసిగొలిపి అర్ధరాత్రి విగ్రహాన్ని తొలగించారని ఆయన మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి మెప్పు కోసం పోలీసులు దొంగల్లా రాత్రికి రాత్రే వ్యవహరించాల్సిన దుస్థితి ఎందుకు వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్టల్లా పోలీసులు నడుచుకోవద్దని, చట్టాన్ని, ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని ఆయన హితవు పలికారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని పోలీసులు, కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపును నిరసిస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను తెల్లవారేసరికి అరెస్టులు చేయడం, గృహ నిర్బంధాలు విధించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్ర పాలన నాటి కర్కశత్వాన్ని మరోసారి ప్రదర్శిస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల హక్కులను, ప్రజాస్వామ్య నిరసనలను అణచివేయడం సరైన పద్ధతి కాదని ఆయన స్పష్టం చేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపు చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ వ్యవహారంపై ప్రభుత్వం తక్షణమే వెనక్కి తగ్గాలని డిమాండ్ చేశారు శాసనమండలిలో విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు నాగుర్ల వెంకన్న, మర్రి యాదవరెడ్డితో పాటు నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి, గృహనిర్బంధంలో ఉంచడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు.అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు నమోదు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో ఉన్న పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యుల మనోధైర్యాన్ని ఇలాంటి తుగ్లక్ చేష్టలతో దెబ్బతీయకూడదని సూచించారు.ముమ్మాటికీ రాష్ట్రంలో ఏర్పడేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెట్టుకోవటమే కాకుండా ఆయన వీరోచిత పోరాటానికి శాశ్వత కీర్తిని తెస్తామని కేటీఆర్ పునరుద్ఘాటించారు.

# లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం మోపాలి

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వీ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం గర్భస్థపూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లింగ నిర్ధారణ పరీక్షల నిరోధానికి చేపడుతున్న చర్యల విషయమై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకుని నివేదికలు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నామ్ కే వాస్తేగా సమావేశాలు నిర్వహించి తీర్మానాలు రాసుకోవడంతోనే సరిపెట్టుకోకుండా, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై క్షేత్ర స్థాయిలో గట్టి నిఘా ఉంచాలని అన్నారు. జనన వివరాలను అనుసరిస్తూ ఆడ, మగ నిష్పత్తిలో ఎక్కువ వ్యత్యాసం ఉంటే, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు భావించాల్సి వస్తుందన్నారు. ఈ తరహా వ్యత్యాసం ఎక్కువగా నగరాలు, పట్టణ ప్రాంతాలలోనే కనిపిస్తోందని, దీనిని బట్టి గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు తెలుస్తోందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో గట్టి నిఘా ఉంచితే ఈ తరహా అమానవీయ ఘటనలకు ఆస్కారం ఉండదని సూచించారు. ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా, వాటి అమలు సక్రమంగా లేకపోతే ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇకపై జిల్లాలో ఎక్కడ కూడా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగకుండా గట్టి నిఘా పెట్టాలని, నిబంధలను అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేయాలని, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భం దాల్చిన నాటి నుండి గర్భిణీల వివరాలను పక్కాగా నమోదు చేయాలని, వారిలో ఎంతమందికి కాన్పు జరిగిందన్నది పరిశీలించాలన్నారు. గర్భం దాల్చిన మీదట కాన్పు జరగని కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తే, గర్భ నిర్ధారణ, గర్భ విచ్ఛిత్తి ఘటనలను గుర్తించేందుకు ఆస్కారం ఉంటుందని, తద్వారా ఈ చర్యలకు పాల్పడిన స్కానింగ్ సెంటర్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పక్కాగా నిబంధనలు పాటించే స్కానింగ్ కేంద్రాలకే లైసెన్సులు రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. పి.సి.పి.ఎన్.డి.టి, ఎం.టి.పీ చట్టాలను ఉల్లంఘించడం వల్ల సమాజంలో స్త్రీ, పురుషుల నిష్పత్తి గణనీయంగా తగ్గిపోతున్నదని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. పుట్టబోయే శిశువు ఆడ, మగ ఎవరైనా సరే, అందరూ సమానమే అని ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, కమిటీ సభ్యులు ఎస్.సిద్దయ్య, బి.ఆంజనేయులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన అటవీశాఖా అధికారులు

కలప రవణదారులు బతిమాలి కాళ్ళ బేరం కు రావడం తో 50 వేలు ఇవ్వాల్సిందే అని పట్టుబట్టారు అటవీ అధికారులు.. 28000 ఫోన్ పే ద్వారా స్వీకరించారు. తరువాత రూ. 22 వేలు నగదు రూపంలో తీసుకున్నారు. అటవీ శాఖ రెసిప్ట్ కావాలంటే మరో రూ. 6 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. బాధితులు ఏసీబీ ని ఆశ్రయించగా మంగళవారం లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు అవినీతి నిరోధక శాఖ అధికారులు.. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాంబాబు, బీట్ ఆఫీసర్ మురళి కృష్ణ లను అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిచినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

# ఏసీబీ వలలో టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్

హైదరాబాద్, బతుకమ్మ :జీహెచ్ఏం సీ పరిధిలో ని చార్మినార్ జోన్ లోని సంతోష్ నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు చిక్కారు.. మంగళవారం ఏసీబీ అధికారులు బిల్డింగ్ పర్మిషన్ పైల్ ముందుకు కదిలించడానికి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ ప్రభావతి ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

ఈ మేరకు కేసు నమోదు చేసి టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ ను ఏసీబీ కోర్ట్ లో హాజరు పరిచారు. అవినీతి నిరోధక శాఖ న్యాయస్తానం ప్రభావతి కి రిమాండ్ విధించింది.



# నిషేధిత భూముల పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా

హైదరాబాద్, బతుకమ్మ :22-ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఎటువంటి ఆటంకాలు ఉండకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకొన్న వారి ఆస్తులు 22-ఏ జాబితాలో ఉంటే, రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లో పరిశీలించి, అది ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే చేస్తారు.జిల్లా కలెక్టర్లు 22-ఏ జాబితా భూములను క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి సరైన జాబితాను రూపొందిస్తారు. అందులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని, ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రైవేటు భూములకు సంబంధించి ఒక్క అంగుళం భూమికి కూడా ఇబ్బంది రానివ్వం అని తెలిపారు.22-ఏ భూముల విషయంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దు. ఎటువంటి పుకార్లు, కట్టు కథలను విశ్వసించవద్దు అన్నారు



# సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

## పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం ఉపసంహరించుకోవాలి

## పాలిటెక్నిక్ విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలి

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన







నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలినం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకో వాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగరంలో నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదు ట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు.జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అనే ఆయన పేర్కొన్నారు దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లమా విద్య అందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి గాని పేద విద్యార్థులను మరింత విద్యకు దూరం చేసే కుట్రలకు పూనుకుంటుందినీ ఆయన అన్నారు.పాలిటెక్నిక్ కళాశాలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువ చ్చిన జీవో నెంబర్ 97 ను ఉప సవరించు కోవాలన్నారు రాష్ట్రంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్గ్రేడ్ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో అందుకు మంత్రివర్గం ఉప సంఘం పచ్చ జెండా ఊపింది కొత్తగా కానీ ఆ తర్వాత కొత్తగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు ఐటీ పరిశ్రమలు శాఖ పరిధిలో నడుస్తున్న ఈ యూనివర్సిటీని సాంకేతిక విద్యా శాఖ పరిధిలోకి తెస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆ దిశగా ముందడుగు పడలేదు తాజాగా ఐటిఐలు ఏటీసీలు పాలిటెక్నిక్ కళాశాల ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చేర్చాలని సర్కార్ నిర్ణహించింది దీంతో ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖతోఆటలాడుతుందని ఇలాంటి నిర్ణయాలను వెనుక తీసుకోవాలని ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందని, వేలాదిమంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ అవుతే నేడు ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్ణయాన్ని చూసి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, లక్షలాదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి అధ్యాపకులు భర్తీ, ల్యాబ్ల ఆధునికరణ వర్క్ షాపులు నిర్వహణ హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్ ఆలోచన చేయడం సరికాదని తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకో వాలని లేని ఎడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యుడు కిషార్, జిలా నాయకులు అజేష్, రామ్ చరణ్, నీరజ్, నాగేష్, శివ పవన్, కిషోర్, భాను ,విష్ణు మహేందర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జూదంపై కామారెడ్డి పోలీసుల ఉక్కుపాదం



కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి జిల్లాలో ని లింగంపేట, బీర్కూర్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో పేకాట స్థావరా ల పై పోలీసులు దాడి నిర్వ హించారు. పేకాట ఆడుతున్న 7 మంది పట్టివేత -- కేసులు నమోదు చేసిరూ.5,270 , 9 మొబైల్ ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర మాట్లాడుతూ:జూదానికి బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. జూదం, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల కఠిన చర్యలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు. జూదంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



# శాసన వ్యవస్థ గౌరవాన్ని కాపాడటం..

## ప్రజల విశ్వాసాన్ని పెంచే దిశగా ఎథిక్స్ కమిటీ పనిచేస్తుంది

## ఏతిక్స్ కమిటీ చైర్మన్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్






హైదరాబాద్, బతుకమ్మ :శాసన వ్యవస్థ గౌరవాన్ని కాపాడుతూ, ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఎథిక్స్ కమిటీ సమర్థవంతంగా పనిచేస్తుందని చైర్మన్ బొమ్మ మహేష్ కుమార్ అన్నారు.శాసన మండలి ఎథిక్స్ కమిటీ (2026--27) ప్రాథమిక సమావేశం మంగళవారం జరిగింది.కౌన్సిల్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన శాసన మండలి ఎథిక్స్ కమిటీ (2026--27) ప్రాథమిక సమావేశానికి ఎథిక్స్ కమిటీ చైర్మన్గా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వ్యవహారించారి..ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ...ప్రజాప్రతినిధుల ప్రవర్తనలో పారదర్శకత, జవాబుదారీతనం, న్యాయం, సమానత్వం వంటి విలువలను మరింత బలోపేతం చేయడమే కమిటీ ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమే అయినప్పటికీ, అవి హద్దులు దాటకుండా సభ్యులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. ప్రజా సంక్షేమమే ప్రజాప్రతినిధుల ప్రధాన ధ్యేయంగా ఉండాలి అన్నారు. శాసన సభ్యుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, సభా చర్చల్లో భాష వినియోగం విషయంలోనూ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ , రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు


# గాంధారి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేతాజీ వర్ధంతి




గాంధారి, బతుకమ్మ :జాతీయ బీసీ సంక్షేమ సంఘం గాంధారి మండల శాఖ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ ను స్మరించుకుంటూ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా జాతీయ బిసి సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షులు చీమల్ వార్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేతాజీ అనేక కష్టాలను ఎదుర్కొని ఆజాద్ హింద్ ఫౌజ్ ను ఏర్పాటు చేశారని అన్నారు.
"మీరు నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను" అనే నినాదంతో యువతలో దేశభక్తి రగిలించారని . తన ప్రాణాలను కూడా దేశం కోసం పణంగా పెట్టారని గుర్తు చేశారు.నేతాజీ త్యాగమే ఈరోజు మనం స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవడానికి కారణమని ఆయన చూపిన మార్గంలో నడవడమే మనందరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దోల్లు లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీలు నస్కంటి రవి,సామల రాజు, వంజరి రాకేష్,యూత్ అధ్యక్షులు సిందే నితిన్, టౌన్ సెక్రటరీ ఆరె కటిక మోతిలాల్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆకుల రాకేష్, ఎండ్రియాల గోపాల్ తదితరులు పాల్గొన్నారు

# బీజేపీ ఓబీసీ మోర్చా నిర్మల్ జిల్లా ఇంచార్జ్ గా మదాసు స్వామి యాదవ్





భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా తెలంగాణ

తేది : 17/08/2026

శ్రీ/శ్రీమతి M. SWAMY YADAV గారికి, మిమ్మలను భారతీయ జనతా పార్టీ తెలంగాణ ఓబిసి మోర్చా NIRMAL DISTRICT INCHARGE పదవికి నియమించానని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.

బిజెపి సిద్ధాంతం, ఆదర్శాలకు అంకితమై నీతి, నిజాయితీ, నిబద్ధత, చిత్తశుద్ధి, క్రమశిక్షణతో వ్యవహరిస్తూ సహచార కార్యకర్తలు, పార్టీ కమిటీలతో కలసి అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని, మీ ప్రాంతంలో ప్రజా సమస్యలు గుర్తించి ఉద్యమాలు చేపడతారని, పార్టీని సంస్థాగతంగా పటిష్టపరిచి అన్ని వర్గాలలో మరింత విస్తరించడానికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను.

అభినందనలతో

(గంధమల్ల ఆనంద్ గౌడ్)

భారతీయ జనతా పార్టీ తెలంగాణ ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు

నిజామాబాద్, బతుకమ్మ :భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నిర్మల్ జిల్లా ఇంచార్జ్ గా ఇందూరు నగరానికి చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మదాసు స్వామి యాదవ్ ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా స్వామి యాదవ్ మాట్లాడుతూ తనకు రాష్ట్ర నాయకత్వం అందించిన నూతన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, నిర్మల్ జిల్లా లో సమస్త బీసీ సమాజాన్ని ఏకంచేసి బీసీల హక్కుల కోసం నిరంతర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఒక బీసీ బిడ్డ నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత దేశం ప్రపం చాన్నే శాసించే శక్తిగా ఎదిగిందని, ఇదే స్ఫూర్తి, ఉత్సాహంతో తాము కూడా బీసీ కులాలను ఏకంచేసి సుసంపన్న భారత దేశాన్ని నిర్మిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.నిర్మల్ జిల్లా ఇంచార్జ గా తనకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యకుడు ఆనంద్ గౌడ్ రాష్ట్ర,జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## బీసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్ధార్ పాపన్న జయంతి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :బహుజన వీరుడు"మహారాజు" సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు.... వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద గల విగ్రహాల పార్కులో గల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజన ధీరత్వానికి ప్రతీక అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో బహుజనులు అందరి ముందుకు సాగి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు.... బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు కావాలంటే బీసీ కులాలు అన్ని ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్,ఆకుల ప్రసాద్, ధర్మనం దేవేందర్, కొయ్యాడ శంకర్, చంద్రకాంత్, శ్రీలత, ఆర్టీసీ శ్రీనివాస్, సాయి బసవ, జయ, అనిల్, సత్యనారాయణ, గంగాధర్, నరహరి తదితరులు పాల్గొన్నారు

## కొండగట్టు రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

### ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు



జగిత్యాల, బతుకమ్మ :కొండగట్టు వద్ద కరీంనగర్--జగిత్యాల ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు. మంగళవారం ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన ఎస్పీ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, రహదారి పరిస్థితి, వాహనాల కదలిక, వాహన వేగం తదితర అంశాలపై సంబంధిత పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను అన్ని కోణాల్లో విచారించి, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, వాస్తవాలను వెలికితీసే విధంగా దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు. వాహనదారులు అధిక వేగంతో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముందున్న వాహనాలను ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తగా నడుపుతూ, ముందున్న వాహనాలకు తగిన దూరం పాటించాలని, ప్రధాన రహదారులపై మరింత అప్రమత్తంగా ప్రయాణించాలని తెలిపారు.



## జీవో .97ను వెంటనే రద్దు చేయాలని పిడిఎస్ యూ నిరసన







నవీపేట్, బతుకమ్మ :ఐటీఐ, డిప్లొమా కళాశాలలను విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో .97ను వెంటనే రద్దు చేయాలని పిడిఎస్ యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) ఆధ్వర్యంలో నవీపేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి మండల తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, సంబంధిత డిప్యూటీ తహసీల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా పిడిఎసు యూ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కర్క గణేష్, పిడిఎసుయూ నవీపేట్ మండల అధ్యక్షులు రేహాన్ మాట్లాడుతూ, ఐటీఐ, డిప్లొమా విద్యను ఒకే వ్యవస్థలో విలీనం చేయడం వల్ల విద్యార్థుల విద్యా ప్రమాణాలు, సాంకేతిక నైపుణ్యాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, అధ్యాపకుల కొరత వంటి సమస్యలు ఉన్న సమయంలో ఇలాంటి విలీన నిర్ణయాలు తీసుకోవడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని విమర్శించారు.ఐటీఐ విద్యకు, డిప్లొమా సాంకేతిక విద్యకు వాటి స్వంత ప్రత్యేకతలు ఉన్నాయని, రెండు విభిన్న విద్యా వ్యవస్థలను విలీనం చేయడం వల్ల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. డిప్లొమా విద్యార్థులకు అవసరమైన ప్రయోగశాలలు, వర్క్‌షాప్‌లు, నిపుణులైన అధ్యాపకులు, తగిన విద్యా వాతావరణాన్ని ప్రభుత్వం మరింత బలోపేతం చేయాల్సిన సమయంలో విలీన నిర్ణయం తీసుకోవడం సరైనది కాదన్నారు.ప్రభుత్వం విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని జీవో .97ను తక్షణమే రద్దు చేయాలని, ఐటీఐ మరియు డిప్లొమా కళాశాలలను వాటి ప్రత్యేకతలకు అనుగుణంగా స్వతంత్రంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే పిడిఎసు యూ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పిడిఎసు యూ జిల్లా సహాయ కార్యదర్శి ఆలోట్ సృజన్, జిల్లా నాయకులు రేహాన్, అయాన్, రామ్ చరణ్,శాన్, శృతి, వైష్ణవి తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆగస్ట్ 24 నుంచి ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల బంద్





### ఆటో డ్రైవర్ల జేఏసీ పిలుపు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :రాష్ట్ర ప్రభుత్వం ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి జరిగే ఆటో క్యాబ్ స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక బంద్ కు పిలుపు ఇచ్చింది. మంగళవారం బంద్ పోస్టర్లను జిల్లా కేంద్రంలోని ఎన్.ఆర్ భవన్లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏఐటియుసి, బీఆర్టియు, సిఐటియు, టీయుసీఐ, ఐఎఫ్టియు యూటీయూసీ, టిఆర్టియు అనుబంధ ఆటో కార్మిక సంఘాల బాధ్యులు హన్మండ్లు, షాదుల్లా, ఉద్ధవ్, గంగాధర్, సుధాకర్, శివకుమార్, రాములు, శ్రీనివాస్ లు మాట్లాడుతూ ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఓలా ఉబర్ రాపిడో యాప్ లకు బదులుగా ప్రభుత్వమే కొత్త యాప్ ను తీసుకురావాలన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12వేలు ఇవ్వాలన్నారు. రోజువారీగా ప్రజలకు సౌకర్యం కల్పించే ఆటో డ్రైవర్లకు ఈ చలాన్ ల నుంచి మినహాయించాలన్నారు.యాక్సిడెంట్ బీమాను కొనసాగించాలని, 50 సంవత్సరాలు పూర్తయిన డ్రైవర్లకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 24 నుండి జరిగే ఆటో క్యాబ్ స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక బంద్ ను జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో ఆటో జేఏసీ నాయకులు జబ్బార్, హుస్సేన్, విఠల్, అబ్దుల్, గఫార్, సురేందర్, గణేష్, అక్లిక్, ఇమ్రాన్, శ్రీనివాస్, రాజు, కృష్ణ ముజీబ్, ఇర్ఫాన్, రఫీయుద్దీన్ , నరసయ్య, ప్రభాకర్, నరేష్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై దుకాణదారులకు మున్సిపల్ కమిషనర్ సూచనలు

### దుకాణాల ముందు చెత్త వేయొద్దు....తడి, పొడి చెత్తను వేరు చేయాలి.





బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు దుకాణ యజమానులు బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ గోవు గంగాధర్ సూచించారు. ప్రతి వ్యాపారి తన దుకాణం ముందు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.దుకాణాల వద్ద చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రత్యేకంగా చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తడి చెత్త,పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు, ఆహార వ్యర్థాలు తదితరాలను డ్రైనేజీ కాలువల్లో వేయడం వల్ల మురుగునీటి సమస్యలు తలెత్తుతాయని, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని చెప్పారు.ఆహార పదార్థాలు విక్రయించే దుకాణాల యజమానులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిశుభ్రతా ప్రమాణాలను పాటించాలని కమిషనర్ సూచించారు. దుకాణాల ముందు మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తెలిపారు.పరిశుభ్రమైన పట్టణం కోసం మున్సిపాలిటీ చేపడుతున్న కార్యక్రమాలకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తిస్తేనే బాన్సువాడను మరింత పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దగలమని పేర్కొన్నారు.

బతుకమ్మ


# కళ్యాణలక్ష్మి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలి.

## కళ్యాణలక్ష్మి లక్ష రూపాయల చెక్ తో పాటు తులం బంగారం తక్షణమే ఇవ్వాలి

## ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు.






బాన్సువాడ బతుకమ్మ : తెలంగాణలో అబద్ధపు హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా పేదలు, మహిళలు, రైతులు, వృద్ధుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారాఖ్ పథకాలను నిర్వీర్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే బిజీరెడ్డి గోవర్దన్ తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వము కళ్యాణ లక్ష్మి పథకం రద్దు చేయడానికి చేస్తున్న కుట్రలను నిరసిస్తూ బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని పథకాల అమలులో ఎలాంటి కోతలు విధించకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రయోజనం అందించాలని కోరుతూ ఆర్డీఓ రవీందర్ రెడ్డి కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాజీ రెడ్డి గోవర్దన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మి ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. పేదింటి ఆడబిడ్డల వివాహ భారం తగ్గించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తెలంగాణలో లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచాయన్నారు. ఈ పథకాలు గత పదేళ్లుగా విజయవంతంగా అమలవుతున్నప్పటికీ, ప్రస్తుతం ప్రభుత్వం వారి అనుకూలమైన వ్యక్తి తో కోర్టులో కేసు వేయించి ఈ పథకాన్ని రద్దు చేయాలన్న కుట్రలు చేస్తుందన్నారు .కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేయకుండా ఈ పథకాలను కొనసాగిస్తామని ప్రభుత్వం కోర్టులో స్పష్టమైన అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయడం లేదు అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మి ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తో సహా పేదల హక్కులను కాపాడే వరకు పోరాటం ఆగదని, ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలను సమీకరించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బాజీ రెడ్డి గోవర్దన్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా తోట అగన్న మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఈ పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ప్రయోజనం అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, సంక్షేమ పథకాలను కాపాడేందుకు ప్రజల తరపున బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, మాజీ జెడ్పిటిసి రత్నా కుమార్, మోరేల్ శ్రీనివాస్, కౌన్సిలర్లు ఫెరోజ్ ఖలీల్, మక్బూల్, ఎర్రవట్టి సాయిబాబా, రమేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ బాడీ శ్రీనివాస్, అక్బర్ లతో పాటు బీఆర్ఎస్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండల కేంద్రంలో గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆయన చిత్రపటానికి గౌడ కులస్తులు పూలమాలలు వేసి ఘన నివాళులార్పించడం జరిగింది. ఈ సందర్భంగా విజి గౌడ్ హాజరై మాట్లాడుతూ.. సామాన్యుల బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ గోల్కొండలోని జమీందారుల పెత్తందారులు వాళ్లందర్నీ తరిమికొట్టి వీరోచిత పోరాటం చేసి గోల్కొండ కోటపై జెండాను ఎగరవేయడం జరిగిందిని తెలిపారు. ఈరోజు హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై గౌడ కులస్తుల ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాస్య విగ్రహాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆవిష్కరిస్తుంన్నందున హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరి సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ నిస్సార్, గౌడ సంఘం అధ్యక్షులు గుండూరి విఠల్ గౌడ్, గౌడ కులస్తులు సుదర్శన్ గౌడ్, గుండూరి ప్రశాంత్ గౌడ్, రాజు గౌడ్, గుండూరి శ్రీకాంత్ గౌడ్, సుధాకర్ గౌడ్, శ్రీను గౌడ్, రామ గౌడ్, నారా గౌడ్, పత్తి రాము, బీఆర్ ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ గాండ్ల మధు తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి



లింగంపేట్ బతుకమ్మ:పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ సూచించారు. లింగంపేట్ మండలం శెట్టిపల్లి, రాంపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పాటు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో ప్లాస్టిక్ వేస్టేజ్ కలెక్షన్ సెంటర్లను ప్రారంభించారు. అలాగే బోర్వెల్ రీఛార్జ్ పిట్ల నిర్మాణం పనులను ప్రొబేషనరి డిప్యూటీ కలెక్టర్ ప్రారంభించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి సురేందర్, ఎంపీడీవో బ్రహ్మానందం, ఎంపిఓ మలహరి, ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులు ఉన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా స్వచ్ఛతా పక్వాడా.



బాన్సువాడ బతుకమ్మ : నసుర్లబాద్ మండలంలోని అంకోల్ తండా ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మేరా యువ భారత్, సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మై భారత్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్లను బ్లీచింగ్ పౌడర్, హార్పిక్‌తో శుభ్రపరిచారు. అలాగే వాటర్ ట్యాంకులో బ్లీచింగ్ పౌడర్ వేసి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సునీల్ రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన వాతావరణంతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. స్వచ్ఛతా పక్వాడా సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, చెస్, స్కిప్పింగ్ తదితర ఆట వస్తువులను అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజ్, అంకోల్ తండా నాయకులు బాబు, ఉపాధ్యాయులు సురేష్, శంరావ్, సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు, మై భారత్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జూనియర్ ఎంఎల్టీలకు అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ల ప్రదానం



బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ ఏరియా ఆసుపత్రి ఎంసీహెచ్ లోని సెంట్రల్ ల్యాబ్‌లో ఏడాది పాటు జూనియర్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్ (జూనియర్ ఎంఎల్టీ) అప్రెంటిస్‌షిప్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ఘనంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. శ్రీనివాస్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు తమ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. అప్రెంటిస్‌షిప్‌లో భాగంగా విద్యార్థులు ఏడాది పాటు సెంట్రల్ ల్యాబ్‌లో విధులు నిర్వహిస్తూ ప్రయోగశాల విధానాలు, రక్త పరీక్షలు, వివిధ రకాల వైద్య పరీక్షల నిర్వహణ, నమూనాల సేకరణ, ల్యాబొరేటరీలో పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై ప్రాయోగిక అనుభవాన్ని పొందారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. అప్రెంటిస్‌షిప్ ద్వారా పొందిన శిక్షణ, అనుభవం విద్యార్థుల భవిష్యత్ వృత్తి జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వైద్య రంగంలో ల్యాబొరేటరీ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని, రోగులకు సరైన వైద్య సేవలు అందించడంలో వైద్య పరీక్షలు ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు రూత్ సిస్టర్, అమృత సిస్టర్, శారద సిస్టర్ పాల్గొని అప్రెంటిస్‌షిప్ శిక్షణ పూర్తి చేసిన జూనియర్ ఎంఎల్టీ విద్యార్థులను అభినందించారు. శిక్షణ సమయంలో విద్యార్థులు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, అనుభవజ్ఞులైన సిబ్బంది నుంచి అనేక విషయాలను నేర్చుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లింగంపేట్ బతుకమ్మ :లింగంపేట మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన ధరణి లింగం(58) చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. లింగం గత కొంతకాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆసుపత్రుల చుట్టూ తిరిగిన వ్యాధి తగ్గకపోవడంతో జీవితం పై విరక్తి చెంది ఈనెల 8వ తేదీన పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వారు తెలిపారు. లింగం పురుగుల మందు సేవించిన విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాధితున్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. లింగం మృతి పట్ల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

# సర్‌తో ఓటు హక్కు, స్వేచ్ఛకు భంగం

ప్రశ్నిస్తే దిమాగీ నక్సల్సా..?

మోదీ నియంతృత్వ ధోరణికి నిదర్శనం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్









నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో ప్రజల ఓటు హక్కుతో పాటు ఓటు వేసే స్వేచ్ఛను ఎన్నికల సంఘంతో కలిసి బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ కార్యకర్తల కు 2 రోజుల క్లాస్ల కు హాజరయ్యారు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అబ్బాస్ మాట్లాడుతూ...రాష్ట్రంలో 3.28 కోట్ల మంది ఓటర్లు ఉంటే, ఎస్ఐఆర్ పేరుతో ఇప్పటికే 78 లక్షల ఓట్లను తొలగించారని, తాజాగా విడుదల చేసిన డ్రాఫ్ట్ జాబితాలో 2.68 లక్షల మంది ఓటర్లను చూపించి, వీరిలోనూ 93 లక్షల మంది ఓటర్లకు అనుమానాస్పద పేరుతో నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. ఇది రాష్ట్రంలో సగం మంది ఓటర్లను తొలగించే కుట్రలో భాగమేనని ఆరోపించారు. ఇప్పటికే బీఎల్ఓలకు ఓటర్లు తమ వివరాలను అందించారని, వాటితోనే ముందుకు వెళ్లకుండా ఓటర్లను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవాలనుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం కలిసి చేపడుతున్న ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను ప్రజలు వ్యతిరేకించి పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో, నాడు స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిని స్మరించుకుంటూ మోదీ మాట్లాడాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా అత్యంత ప్రమాదకరమైన ఆలోచనా ధోరణితో మాట్లాడారని అబ్బాస్ అన్నారు. 'దిమాగీ నక్సల్స్' లేకుండా చేస్తామనడం అంటే దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రశ్నించే స్వేచ్ఛను లేకుండా చేసే ప్రయత్నమేనని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజునే ఇలాంటి దుర్మార్గమైన ఆలోచనలు చేయడం అహంకారపూరిత, నియంతృత్వ ధోరణిని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. రాబోయే కాలంలో ప్రభుత్వ పనితీరుపై ఎవరైనా ప్రశ్నించినా, నిలదీసినా వారిని 'దిమాగీ నక్సల్స్' పేరుతో వేధింపులకు గురిచేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధం కావాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో గోదావరి జలాలు వృథాగా పోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అబ్బాస్ డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి మూడు టీఎంసీల నీటిని వృథాగా పోనివ్వకుండా ఎత్తిపోసి, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను నింపుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆరోపించారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, లేదంటే రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకటరాములు, పల్లపు వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు జంగ గంగాధర్ ఏషాల గంగాధర్, నన్నెసాబ్ ,కొండా గంగాధర్, మరియు అనుసూయ అనిత, ఎల్లయ్య, నర్సయ్య, శ్రీనివాస్, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులను నిర్మించాలి

ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీకి విద్యార్థి సంఘాల వినతి



కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అదనపు గదులు నిర్మించాలని కళాశాల సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో 8 కోర్సులలో 1000 పైగా విద్యార్థులు చదువుతున్నారు, కానీ విద్యార్థులకు అనుగుణ ంగా ఉండాల్సిన గదులు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారు. చెట్ల కింద క్లాస్ రూమ్ బయట కూర్చుని చదువుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఒక్కొక్క తరగతి గదిలో రెండు మూడు కోర్సులు విద్యార్థులు కూర్చోవడం జరుగుతుందన్నారు. అలాగే విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. సరైన టాయిలెట్లు,బాత్రూంలు డెస్కులు లేవు అన్నారు. ప్రహరీ గోడ లేకపోవడంతో పాములు ఇతర క్రిమి కీటకాలు రావడం జరుగుతుంది. కావున వెంటనే ప్రహరీ గోడను నిర్మించాలన్నారు. విద్యార్థులకు అనుగుణంగా వెంటనే నూతన గదులను నిర్మాణం చేపట్టాలన్నారు. కళాశాల అభివృద్ధి కోసం అదనంగా నిధులు కేటాయించాలని విద్యార్థి సంఘాలు కోరడం జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ముదం అరుణ్ కుమార్, ఏఐఎస్ ఏ జిల్లా కన్వీనర్ జీవియం విట్టల్ , విద్యార్థి సేన జిల్లా అధ్యక్షులు వినయ్, జీవీఎస్ జిల్లా అధ్యక్షులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను, సాదాబైనామా దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో ఆయా మండలాల వారీగా సాధించిన ప్రగతిని పరిశీలించారు. పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, సాదాబైనామా అర్జీలను తిరస్కరించినట్లైతే అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన, వాటి పరిష్కారంలో జాప్యం చేయవద్దని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

భార్యను చంపేశానని పోలీసులకు సమాచారం

..పోలీసుల అదుపులో నిందితుడు



లింగంపేట్, బతుకమ్మ :మూడు ముళ్ళు వేసి పెళ్లి చేసుకున్న భర్త తేలికపాటి మనస్పర్ధల కారణంగా అర్ధరాత్రి కట్టుకున్న భార్యపై కత్తితో దాడి చేసి పారిపోయిన సంఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం ముస్తాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముస్తాపూర్ గ్రామానికి చెందిన వడ్ల లావణ్యనకు, శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన బహుగుణ చారితో గత ఐదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యా భర్తల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా భార్య లావణ్య ఇటీవల ముస్తాపూర్ గ్రామంలోని తన తల్లి గారి ఇంటికి వచ్చింది. భార్యాభర్తల మధ్య ఏర్పడిన విభేదాలతో ఇరువురు తరచూ గొడవ పడడంపై ఇటీవల పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినట్లు సమాచారం. పంచాయతీ నిర్వహించిన పెద్దమనుషులు భార్యాభర్తలు కలిసి ఉండాలని సూచించారు. కుల పెద్దల సూచనల మేరకు భర్త బహుగుణ చారి భార్యను తీసుకుపోయేందుకు సోమవారం అత్తగారిల్లు అయిన ముస్తాపూర్ గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. రాత్రి భోజనాలు చేసి నిద్రించిన అనంతరం అర్ధరాత్రి లేచిన భర్త బహుగుణ చారి వంటింట్లో గల కూరగాయల కత్తితో భార్య లావణ్యపై దాడిచేసి గాయ పరిచినట్లు తెలిపారు. భార్య లావణ్య శరీరంపై కత్తితో దాడి చేసిన నిండితుడు లావణ్య చనిపోయిందని భావించి ఇంట్లో నుంచి పరారైనట్లు తెలిపారు. ముస్తాపూర్ గ్రామం నుండి బయలుదేరిన నిండితుడు పోల్కంపేట చౌరస్తా వద్దకు చేరుకొని తన భార్యను కత్తితో దాడి చేసి హత్య చేశానని స్వయంగా పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించినట్లు వెల్లడించారు. వెంటనే స్పందించిన స్థానిక ఎస్సై దీపక్ కుమార్ పోల్కం పేట చౌరస్తా వద్దకు చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. లావణ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడు బహుగుణ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

**సకాలంలో స్పందించిన సర్పంచ్**

**భర్త నారాయణ....**

సోమవారం అర్ధరాత్రి వడ్ల లావణ్యపై భర్త బహుగుణ కత్తితో దాడి చేసినట్లు తెలుసుకున్న గ్రామ సర్పంచ్ భర్త న్యాయవాది అయిన నారాయణ సకాలంలో స్పందించారు. భర్త కత్తితో దాడి చేయడం వల్ల తీవ్రగాయాలతో కొట్టు మిట్టాడుతున్న లావణ్యను తన కారులో ఎక్కించుకొని వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆదుకున్నారు. బాధితురాలికి కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు చేసిన స్థానిక వైద్యులు మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయడంతో కుటుంబ సభ్యులు లావణ్యను అక్కడికి తరలించారు. భర్త కట్టుకున్న భార్యపై కత్తితో అమానుషంగా దాడి చేయడం మండలంలో సంచలనంగా మారింది.

## అవసరమైన వారికి ఎల్‌వోసీ



నిజామాబాద్, బతుకమ్మ : నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో అవసరమైన వారికి నిమ్స్ లో చికిత్స పొందేందుకు ఎల్వోసీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎల్వోసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన వారికి ఎల్ఓసి ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. నగరంలోని సారంగాపూర్ కు చెందిన కల్పన గుండె సంబంధిత వ్యాధితో బాదపడుతున్నారన్నారు. దీంతో నిమ్స్ లో చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్వోసీ వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమన్నారు. అలాగే హైదరాబాదులోని బీ బీ నగర్ ఎయిమ్స్ లో అత్యాధునిక సేవలు అందుబాటు వచ్చాయన్నారు. పేదలు దీర్ఘకాలిక వైద్య సమస్యలు ఉన్నవారు, అత్యవసర శస్త్రసికిత్సలు అవసరమైన వారు ఎయిమ్స్ కి వెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం వేల కోట్లతో నిర్మించి, పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు.

## తల్లికి తలకొరివి పట్టిన కూతురు..



ఇందల్వాయి, బతుక మ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారం తాండ పంచాయతీ పరిది ఛలోని ఇందల్వా యి బస్టాండ్ ప్రాంగణంలో నివాసం ఉండే రేకొండ రాజమణి సోమవారం అర్ధరాత్రి మృతిచెందగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు, రేకొండ రాజమణి కి కుమారులు లేకపోవడంతో చిన్న కుమార్తె రాధిక తలకొరివి పెట్టి అంత్యక్రియలను పూర్తి చేశారు, ఇదిలా ఉండగా స్థానిక సర్పంచ్ సంగీత దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ఈ అంత్యక్రియలను నిర్వహించడం గమనార్హం, అనాధ శవంగా పరిగణించే విధంగా మృతురాలు రాజమణి మృతి చెందగా భారీ వర్షం కురుస్తున్న సర్పంచ్ సంగీత దిలీప్ కుమార్ తో పాటు ఉపసర్పంచ్ ధూమ నాయక్ తడుస్తూనే అంత్యక్రియలు నిర్వహించడం విశేషం.. ఒక ప్రజా ప్రతినిధిగా ఉంటూనే మరొకరికి సహాయ సహకారాలు అందించడం పై పలువురు సంగీతా దిలీప్ కుమార్ ప్రశంసలు వర్షం కురిపించారు

# గోదావరి పుష్కర ఏర్పాట్ల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

## అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం

## యంచ వద్ద పుష్కరఘాట్ నిర్మాణానికి అనువైన స్థలం పరిశీలన





నిజామాబాద్ అర్బన్ , బతుకమ్మ : గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నవీపేట మండలం యంచ వద్ద పుష్కర ఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి అనువైన స్థలం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో ముఖాముఖి భేటీ అయి, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. యంచ గ్రామ శివారులో ఎక్కడ పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తే భక్తులకు అనుకూలంగా ఉంటుంది, అవసరమైన స్థలం అందుబాటులో ఉందా, రవాణా వసతి, ఇతర సదుపాయాలు, భద్రతాపరమైన అంశాలు తదితర వాటి గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అన్ని అంశాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని, ప్రభుత్వం నిర్ధారణ చేసిన ప్రాంతంలోనే పుష్కరఘాట్ నిర్మాణం చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిశీలన జరిపిన ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఏమేరకు అందుబాటులో ఉంది, పట్టా భూములు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయన్నది పక్కాగా సర్వే నిర్వహించి వారం రోజుల్లోపు మార్కింగ్ పూర్తి చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను అట్టహాసంగా నిర్వహించేలా ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా పనులను చేపట్టి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర దేవాలయం యంచ గ్రామానికి అత్యంత చేరువలో ఉన్నందున గోదావరి పుష్కర పుణ్య స్నానాల కోసం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున లోటుపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, ఇరిగేషన్, ఎండోమెంట్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

# పేదల కోసం భూలక్ష్మి పథకం

తెలంగాణ రక్షణ సేన పార్టీ నుంచి భూ లక్ష్మి అనే పథకాన్ని ప్రతిపాదిస్తున్నామని ఆమె చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తామన్నారు. బంజరా హిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం అనేది కేవలం నినాదం కాకూడదని దాని ద్వారా విప్లవాత్మక గుణాత్మక మార్పు రావాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఈ మార్పు కోసం తెలంగాణలో మేధావులంతా ఆలోచించి తమతో కలిసి రావాలన్నారు. ఈ నెల 6న తాము నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు వస్తాయని తాము చెప్పామని...ఇప్పుడు అదే జరుగుతోందన్నారు. 31 నెలలుగా సామాజిక న్యాయం గురించి మాట్లాడని ముఖ్యమంత్రి ఇప్పుడు సామాజిక న్యాయం రాగం ఎత్తుకున్నారన్నారు. కానీ ఆయన చెప్పేది సామాజిక న్యాయం, చేసేది ఆటవిక న్యాయం అన్నారు. ప్రభుత్వంలో, పార్టీలో బీసీలకు, మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు సామాజిక న్యాయం చేసే అవకాశం ఉన్న సరే చేయకుండా రాజకీయాల కోసం మాత్రమే ఆయన సామాజిక న్యాయం అంటున్నారని కవిత మండిపడ్డారు. ఎప్పుడో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను సైతం లాక్కుంటూ ముఖ్యమంత్రి కుటుంబం తెలంగాణ భూమాత చెరబట్టారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు భూదొంగలంటూ కవిత విమర్శించారు.

. . . భూలక్ష్మి ద్వారా కుటుంబానికి ఎకరం భూమి

తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలన్నదే తమ ఆకాంక్ష అని కవిత చెప్పారు. కేవలం నినాదాల ద్వారా ఆ కల తీరదని కవిత అన్నారు. సామాజిక న్యాయ తెలంగాణ కోసం తాము ఓ ఓ వైపు సభలు, ధర్నాలు, ఆందోళనల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచుతూ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని చెప్పారు. అదే విధంగా సామాజిక న్యాయ తెలంగాణ కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలను కూడా ఒక్కొక్కటిగా చేపడతామన్నారు. సామాజిక న్యాయ తెలంగాణ అనేది మళ్లీ భూ పంపిణీ కార్యక్రమం చేపట్టినప్పుడే సాధ్యమవుతుందని కవిత అన్నారు. ప్రతి కుటుంబానికి భూమి కల్పించినప్పుడే వాళ్లంతా గౌరవంగా బతుకుతారన్నారు. పేదలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, ఆదీవాసీలకు భూమి అంటే ఎమోషన్, పంచప్రాణాలని కవిత చెప్పారు. అందుకే తమ పార్టీ తరపున భూలక్ష్మి అనే పథకాన్ని ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఎకరం భూమి ఇస్తామని కవిత చెప్పారు. భూమి పంపిణీకి సంబంధించి పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే తాను ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఆధీనంలో 60 లక్షల ఎకరాల భూమి ఉందన్నారు. నిజాం ఇచ్చిన భూములు, భూదాన్ భూములు కూడా లక్షల ఎకరాల్లో ఉన్నాయన్నారు. భూదాన్ భూములకు సంబంధించి లక్ష ఎకరాలు లెక్కలేకుండా పోయాయని వాటిని పేదలకు ఇచ్చి ఉంటే ఎంతో మేలు జరిగేదని కవిత చెప్పారు. ప్రతి కుటుంబానికి ఎకరం భూమి ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వానికి మనసు రావటం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కచ్చితంగా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి కుటుంబానికి ఎకరం భూమి ఇస్తామన్నారు.

. . . ముఖ్యమంత్రి కుటుంబం భూ దొంగలు

తెలంగాణ లో ముఖ్యమంత్రి కుటుంబమే భూదోపిడీకి పాల్పడుతుందని కవిత తీవ్రంగా విమర్శలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రాక్షస రాజ్యం (ఆర్ఆర్ఆర్) నడుస్తుందన్నారు. పేదలకు భూములు పంచాల్సిన ప్రభుత్వమే పరిశ్రమల పేరుతో వాళ్ల భూములు లాక్కుంటుందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పేదల నుంచి 30 వేల ఎకరాలు గుంజుకున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పీవీ, నిజాం లాంటి వాళ్లు పేదలకు భూములు ఇచ్చారని వాటికి యాజమాన్య హక్కులు ఇస్తామని ఎన్నికల సందర్భంలో మాట ఇచ్చి ఇప్పుడు వాటిని లాక్కుంటారా అని మండిపడ్డారు. పేదల భూములు గుంజుకుంటామంటే ఊరుకునేది లేదని కవిత హెచ్చరించారు. ముఖ్యమంత్రి కుటుంబం, వారి ఏడుగురు సోదరుల గురించి దేశమంతా కథలు, కథలుగా చెప్పుకుంటారన్నారు. తెలంగాణ భూమాత చెరబట్టి ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ దోపిడీ చేస్తున్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కుటుంబం భూ దొంగలు అని కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అన్నట్లుగా ఒకరిని గెలిపిస్తే ఇంకొందరు అధికారం చెలాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ని గెలిపిస్తే వారి ఏడుగురు అన్నదమ్ములు, శ్రీధర్ బాబును గెలిపిస్తే వాళ్ల సోదరుడు, భట్టి ని గెలిపిస్తే వాళ్ల కుటుంబం, పొంగులేటిని గెలిపిస్తే వాళ్ల కొడుకు ప్రజలపై జులుం చేస్తున్నారన్నారు. దాదాపు 2 వందల మంది ముఠా ఇలా ప్రజలపై పడి ఇబ్బందులకు గురిచేస్తుందని కవిత అన్నారు. అటు 22 ఏ పేరుతో భూ దోపిడీకి ప్రభుత్వం రాచమార్గం ఏర్పాటు చేసుకుంటుందని కవిత విమర్శించారు. గతంలో ధరణి, ఇప్పుడు భూ భారతిని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. భూముల విషయంలో పేదలకు అన్యాయం చేస్తే ఎట్టి పరిస్థితిలో సహించేది లేదన్నారు.

. . .చెప్పేది సామాజిక న్యాయం.. చేసేది ఆటవిక న్యాయం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేక వన్నె పులి అంటూ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చెప్పేది సామాజిక న్యాయం. కానీ చేసేది ఆటవిక న్యాయం అని కవిత అన్నారు. ఈ నెల 6 న తాము చేపట్టిన సామాజిక సంకల్ప సభ కారణంగానే ముఖ్యమంత్రి నోట సామాజిక న్యాయం అనే మాట అనివార్యంగా వచ్చిందని కవిత అన్నారు. సామాజిక అన్యాయం అనాల్సింది పోయి ముఖ్యమంత్రి సామాజిక న్యాయం అన్నాడని ఆయన మాటలను ప్రజలు నమ్మరని చెప్పారు. నిజంగా సామాజిక న్యాయంపై చిత్తశుద్ధి ఉంటే 16 మంది మంత్రివర్గంలో ముగ్గురే బీసీలు మంత్రులు ఎందుకుంటారని ఆమె ప్రశ్నించారు. గత రెండేళ్లలో 5 లక్షల 96 వేల కోట్ల బడ్జెట్ పెడితే బీసీల కోసం కేవలం 5 వేల 5 వందల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని కవిత చెప్పారు. బీసీల సంఖ్య ఎంత మీరు చేసిన ఖర్చు ఎంత? ఇదేనా సామాజిక న్యాయం అని ప్రశ్నించారు. వీహెచ్ లాంటి సీనియర్ బీసీ నాయకుడికి, శివధర్ రెడ్డి అనే ఓ అధికారికి అడ్వయిజర్ పదవులు ఇస్తే వీహెచ్ కు ఇచ్చిన ర్యాంక్, జీతం ఎందుకు తక్కువగా ఉన్నాయో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్యల విషయంలో కూడా అగ్రకులాలకు ఒక విధంగా, ఇతరులపై ఒక విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఆర్టీఐ కమిషనర్లను నియమిస్తే అందులో ఒక్క బీసీ కూడా లేదని కవిత చెప్పారు. ఇద్దరు మహిళలను మాత్రమే మంత్రివర్గంలో తీసుకొని విజయశాంతి లాంటి నేతకు అన్యాయం చేశారన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అంటే ఇదేనా అని కవిత ప్రశ్నించారు. బీసీ మంత్రులు వాకిటి శ్రీహరి, కొండా సురేఖలను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవమానించిన సంఘటనలను గుర్తు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అటు ప్రభుత్వంలో, పార్టీ లో న్యాయం చేయగలిగే పరిస్థితి ఉన్నప్పటికీ ఈ ముఖ్యమంత్రి అన్యాయం చేస్తున్నాడని కవిత అన్నారు. అలాంటి వ్యక్తి సామాజిక న్యాయం గురించి మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి ఉండదన్నారు. కచ్చితంగా తెలంగాణలో సామాజిక న్యాయం కోసం పాటు పడతామని అన్నారు.

# ఆగస్టు 22న స్పాట్ అడ్మిషన్లు

## గురుకులాల ఆర్ సి ఓ విజయ లలిత వెల్లడి




ఇందల్వాయి ఆగస్టు 18 బతుకమ్మ నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని వివిధ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి ఆగస్టు 22 న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని గురుకులాల ఆర్ సి ఓ విజయ లలిత వెల్లడించారు, ఈ మేరకు మంగళవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలోని 160 జూనియర్ ప్రథమ సంవత్సరం కళాశాలలో అడ్మిషన్లకు అవకాశం ఉందని తెలిపారు, వివిధ గురుకుల కళాశాలలో 160 సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటిని 22 ఆగస్టున పూర్తి చేస్తామన్నారు, అలాగే 240 సీట్లు ఆరవ తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్నాయని ఆమె వివరించారు, జూనియర్ కళాశాలలో చేరెందుకు 22 ఆగస్టు 9 గంటల నుండి నాలుగు గంటల వరకు కంజర గురుకుల కళాశాలకు చేరుకోవాలన్నారు, అలాగే ఆరవ తరగతి నుండి 9వ తరగతి వరకు చేరే విద్యార్థులు ఆర్మూర్ గురుకుల పాఠశాలకు చేరుకోవాలన్నారు

# సిరిసిల్ల జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులుగా వేణుగోపాల్



సిరిసిల్లా, బతుకమ్మ :జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారుల సంఘం కొత్త కార్యవరానికి నిర్వహించిన ఎన్నికల్లో పోలీస్ అధికారులు,సిబ్బంది పోలీస్ అధికారుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అదేశాలతో ఎన్నికల నోడల్ అధికారి స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు ఆర్.ఐ అడ్మిన్ పర్యవేక్షణలో ఈ ఎన్నికలు నిర్వహించబడ్డాయి.ఈఎన్నిక సందర్భంగా జిల్లా ఎస్పీ ఎన్నికలు జరుగుతున్న ప్రాంతానికి చేరుకోని ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందు తీసుకోవాల్సిన చర్యలపై నోడల్, ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు చేసారు.మంగళవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా వేములవాడ టౌన్ కానిస్టేబుల్ ఎస్.గోపాల్, ఉపాధ్యక్షులుగా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వి. రవి వేములవాడ రూరల్ ఎస్.ఐ వెంకట్రాజం లను ఎన్నుకున్నారుసెక్రటరీగా సి.ఐ సిరిసిల్ల రూరల్ కె. నాగేశ్వరరావు ఎన్నిక అయ్యారు జాయింట్ సెక్రటరీ గా గంబిరావుపేట కానిస్టేబుల్ డి.శ్రీనాథ్ రాజ్,ఆర్గనైజింగ్ సెక్రటరీగా స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఏం.ప్రకాష్, ట్రెసరర్ గా జిల్లా పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏ.వేణు ఎన్నికయ్యారు ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబెర్స్ గా .ముస్తాబద్ కానిస్టేబుల్ కె.గోపాల్, ఎల్లారెడ్డిపేట్ కానిస్టేబుల్ ఏ. శ్రీనివాస్,బోయినపల్లి కానిస్టేబుల్ ఏ. సుధాకర్,తంగాళ్లపల్లి హెడ్ కానిస్టేబుల్ పద్మ, ఆర్మడ్ రిజర్వ్ కానిస్టేబుల్ గడ్డం .మహేష్,ఆర్మడ్ రిజర్వ్ కానిస్టేబుల్ బి.తిరుపతి ఎన్నుకున్నారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం సభ్యులకు అభినందనలు తెలియజేసారు.



## దీర్ఘకాలంగా ఒత్తిడి ఉంటే కొలెస్ట్రాల్‌పై ప్రభావం పడే ప్రమాదం.. హెచ్చరిస్తున్న నిపుణులు..

ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు సాధారణంగా మారుతున్నాయి. అయితే వీటి ప్రభావం కేవలం మానసిక ఆరోగ్యంపైనే కాకుండా గుండె ఆరోగ్యంపైనా పడుతోంది. ముఖ్యంగా దీర్ఘకాలిక ఒత్తిడి, అధిక కొవ్వులు, చక్కెరలు ఉన్న ఆహారం తీసుకోవడం వంటి కారణాలు కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండె జబ్బులు, రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. అందుకే ఒత్తిడిని నియంత్రించడంతోపాటు ఆహారపు అలవాట్లపైనా దృష్టి పెట్టడం అవసరం. ఒత్తిడి కొలెస్ట్రాల్‌ను నేరుగా ప్రభావితం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. మనం ఒత్తిడికి గురైనప్పుడు శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు ఎక్కువగా విడుదలవుతాయి. ఇవి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శరీరాన్ని సిద్ధం చేసే ఫైట్ ఆర్ ఫ్లైట్ ప్రతిస్పందనలో భాగంగా పనిచేస్తాయి. అయితే ఒత్తిడి దీర్ఘకాలం కొనసాగితే ఈ హార్మోన్ల ప్రభావం శరీరంలోని జీవక్రియలపై పడుతుంది.

**రక్తనాళాల్లో పేరుకుపోయే కొవ్వు..**

దీర్ఘకాలిక ఒత్తిడి సమయంలో కార్టిసాల్ స్థాయిలు పెరగడం వల్ల కాలేయం మరింత గ్లూకోజ్‌ను తయారు చేయడంతోపాటు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల ఉత్పత్తిని కూడా పెంచుతుంది. ఇవి శరీరానికి కొన్ని ముఖ్యమైన ప్రక్రియల్లో అవసరమైనప్పటికీ, ఎక్కువ కాలం స్థాయిలు అధికంగా ఉంటే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి అడ్డంకులు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి శరీరంలో స్వల్పస్థాయి వాపును కూడా పెంచే అవకాశం ఉంటుంది. నిరంతరం ఒత్తిడికి గురైనప్పుడు హార్మోన్లు, నాడీ వ్యవస్థకు సంబంధించిన కొన్ని మార్పులు ఇన్‌ఫ్లమేటరీ మార్కర్లను ప్రభావితం చేస్తాయి. ఇవి గుండె జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో సంబంధం కలిగి ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఒత్తిడి వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడంతోపాటు శరీరంలో నిల్వ ఉన్న కొవ్వులు రక్తప్రవాహంలోకి విడుదల కావడం కూడా పెరుగుతుంది. దీనివల్ల ట్రైగ్లిజరైడ్లు, మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిలు ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల దీర్ఘకాలిక ఒత్తిడిని కేవలం మానసిక సమస్యగా కాకుండా శారీరక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేసే అంశంగా చూడాల్సిన అవసరం ఉంది.

**ఆహారపు అలవాట్లపైనా ఎఫెక్ట్..**

ఒత్తిడి నేరుగా కొలెస్ట్రాల్‌పై ప్రభావం చూపడమే కాకుండా మన ఆహారపు అలవాట్లను కూడా మారుస్తుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు ఆకలి, కడుపు నిండిన భావనను నియంత్రించే హార్మోన్లలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఫలితంగా కొందరిలో భావోద్వేగాలకు అనుగుణంగా ఎక్కువగా తినే అలవాటు ఏర్పడుతుంది. ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు తీపి, కొవ్వు అధికంగా ఉన్న ఆహారాలపై కోరిక పెరగడం సాధారణం. తక్షణంగా ఆకలి లేదా ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్యాకేజ్డ్ స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్, ఇతర అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారాలను ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ ఆహారపు అలవాట్లు కొనసాగితే కొలెస్ట్రాల్ స్థాయిలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఒత్తిడిని ఎదుర్కొనే క్రమంలో కొందరిలో మద్యం తీసుకోవడం కూడా పెరుగుతుంది. అధిక మద్యం వినియోగం ట్రైగ్లిజరైడ్ల స్థాయిలను పెంచడంతోపాటు గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. అదే విధంగా భోజన సమయాలు కూడా మారిపోతాయి. రాత్రివేళ ఆలస్యంగా ఎక్కువగా తినడం వల్ల అధిక కేలరీలు, సంతృప్త కొవ్వులు, ట్రాన్స్ ఫ్యాట్లు శరీరంలోకి చేరే అవకాశం ఉంటుంది.

**ఒత్తిడి, ఆహారం రెండింటి పాత్ర..**

కొలెస్ట్రాల్ పెరగడంలో ఒత్తిడి, ఆహారం రెండింటికీ పాత్ర ఉంటుంది. కేవలం ఒత్తిడిని తగ్గించడం లేదా కేవలం ఆహారాన్ని మార్చడం మాత్రమే సరిపోదు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఒత్తిడి నియంత్రణతోపాటు సమతుల్యమైన ఆహారం, శారీరక చురుకుదనం వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాలి. ఒత్తిడి కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేస్తుందని సూచించే కొన్ని సంకేతాల్లో తరచూ ఆందోళనగా అనిపించడం, రక్తపోటు, ఒత్తిడిలో ఎక్కువగా తినడం, నడుము చుట్టూ కొవ్వు పెరగడం, నిద్ర సరిగా లేకపోవడం, అలసట, సాధారణ ఆరోగ్య పరీక్షల్లో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడం వంటివి ఉంటాయి. అయితే ఈ లక్షణాలు ఇతర కారణాల వల్ల కూడా వస్తాయని గుర్తుంచుకోవాలి. ఒత్తిడితోపాటు కొలెస్ట్రాల్‌ను నియంత్రించుకోవాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ఉపయోగకరంగా ఉంటుంది. గుండెకు మేలు చేసే ఆహారాన్ని తీసుకోవడం, నిద్ర నాణ్యతను మెరుగుపరచడం, ధ్యానం లేదా మైండ్‌ఫుల్‌నెస్ వంటి పద్ధతులను పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండడమే కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం ద్వారా అవసరమైన మార్పులు చేసుకోవచ్చు.

**ఏం చేయాలి..**

కొలెస్ట్రాల్‌ను ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచేందుకు ఓట్స్, బార్లీ, బీన్స్, పప్పులు, గింజలు, కొవ్వు అధికంగా ఉండే చేపలు, కరిగే పీచు పదార్థం ఎక్కువగా ఉన్న పండ్లు, విత్తనాలు, కూరగాయలు, ఆలివ్ ఆయిల్ వంటి ఆహారాలను ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ముఖ్యంగా పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం గుండె ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటుంది. కొలెస్ట్రాల్ పరీక్షల్లో చెడు కొలెస్ట్రాల్ లేదా మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిలు పదేపదే అధికంగా వస్తుంటే వైద్యులని సంప్రదించడం అవసరం. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు, రక్తపోటు ఉన్నవారు, మధుమేహం లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. అలాగే దీర్ఘకాలిక ఒత్తిడి రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తుంటే దాన్ని నియంత్రించేందుకు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. ఒత్తిడి, ఆహారపు అలవాట్లు రెండూ కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేసే మార్గాలు ఉన్నాయి. దీర్ఘకాలిక ఒత్తిడిని నిర్లక్ష్యం చేయకుండా, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, తగినంత నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చు. కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగినట్లు పరీక్షల్లో తేలితే కారణాన్ని గుర్తించి సరైన వైద్య సలహా తీసుకోవడం మంచిది.

# అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ రహీమోద్దీన్ బదిలీ

**-ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జ్యూడిషియరితో 11 ఏళ్ల అనుబంధం**

**-న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారుల మన్ననలు పొందిన అరుదైన ప్రాసిక్యూటర్**

**-2012 లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటనలో పాల్గొన్న బాలుని బతుకు చిత్రాన్ని జస్టిస్ వర్మ కమిషన్ కు అందజేశారు**

నిజామాబాద్ లీగల్, బతుకమ్మ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాలమూరు జిల్లా అదే మహబూబ్ నగర్ జిల్లా ఒక కరువు పీడిత ప్రాంతం, వలసలకు పేరెన్నికలది, బతుకు తెరువు కోసం బహుదూరపు బాటసారులుగా వెళ్లిన ప్రజలు. కొందరు విద్యాలయాల నుండి విశ్వవిద్యాలయం వరకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించిన వారు మరికొందరు. మహబూబ్ నగర్ జిల్లా ప్రస్తుత నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం అబ్బాయ్ పల్లి అనే ఒక మారుమూల గ్రామం నుండి విద్యే సర్వస్వం అని నమ్మి ఉన్నత విద్యను అభ్యసించిన మహమ్మద్ రహీమోద్దీన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ 2013 లో నిర్వహించిన పరీక్షలలో ఉత్తీర్ణుడై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియామాకం అయ్యారు. అంతకు ముందు ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యుడిగా విధులు నిర్వహించారు. ఢిల్లీలో 2012 దిశంబర్ లో నిర్భయ ఘటనలో పాల్గొన్న బాలుని కుటుంబ, ఆర్థిక, సామాజిక, వృత్తి పరమైన వివరాలు తెలుసుకుని జస్టిస్ వర్మ కమిషన్ కు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రథమ పోస్టింగ్ 05 మే, 2015 లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బిచ్ కుందలోని జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు కేటాయించబడ్డారు. ఉమ్మడి జిల్లాలో ఆర్మూర్, బాన్స్ వాడ, బోధన్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లాకోర్టు సముదాయంలోని జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులలో విధులు నిర్వహించి న్యాయవాదుల, పోలీసుల, కక్షిదారుల మన్ననలు పొందారు. పదకొండు సంవత్సరాల మూడున్నర నెలల పాటు "తానోవ్వక ఇతరులనొప్పించక "అన్నట్లు కాలం వెంట నడిచాడు. క్రిమినల్ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు కోరిందే తడవుగా కలిసి నడిచిండు. జాతీయ లోక్ అదాలత్ లలో రాజీపద్ధతిలో పరిష్కారమయ్యే కేసులలో దస్రాలపై సంతకం జేసీ తనవంతు పాత్ర పోషించారు. మధ్యలో కొన్ని రోజులు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు కలిపి డిప్యూటీ డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ గా వ్యవహారించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ ఎస్. సాంబశివ రెడ్డి రహీమోద్దీన్ ను హైదరాబాద్ ఎల్ బి నగర్ కోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన బదిలీపై వెళ్లనున్నారు. అందరి మన్ననలే మహాప్రసాదంగా మూటగట్టుని వెళుతున్నానని మహమ్మద్ రహీమోద్దీన్ బతుకమ్మ తో అన్నారు. తన వృత్తి జీవన ప్రయాణం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో ప్రారంభమైనదని ఎంతో విలువైన న్యాయ విజ్ఞానం న్యాయవాదుల నుండి నేర్చుకున్నానని ఆయన భావోద్వేగంతో తెలిపారు. పోలీసు శాఖ నుండి సంపూర్ణ సహకారం, ప్రోత్సాహం లభించిందని




అన్నారు. న్యాయమూర్తుల వెన్నుదన్ను తన వృత్తిలో వెన్నుముకగా పని చేసిందని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్, కామారెడ్డి న్యాయవ్యవస్థలు తనకున్న చిన్న చరిత్రలో చిరకాలం నిలిచి ఉంటాయని ఆయన అన్నారు.

# మనం వాడుతున్న ప్రోబయోటిక్ ట్యాబ్లెట్లపై ఆసక్తికర అధ్యయనం.. అవి మనకు సరిపోవట.. ఎందుకంటే..

మన జీర్ణవ్యవస్థలో ఉండే సూక్ష్మజీవులు ఆహారం, జీవనశైలి, తరతరాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అందుకే అందరికీ ఒకే రకమైన ప్రోబయోటిక్ ఉత్పత్తులు సమానంగా పనిచేస్తాయా అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశంలోని వివిధ గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌ను పరిశీలించిన తాజా పరిశోధనలో ఇప్పటివరకు గుర్తించని కొన్ని బ్యాక్టీరియా జాతులతోపాటు వందలాది స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లు బయటపడటం ఈ అంశంపై కొత్త చర్చకు దారితీసింది. దేశంలోని కొన్ని గిరిజన సముదాయాలకు చెందిన ఆరోగ్యవంతుల గట్ మైక్రోబయోమ్‌ను పరిశోధకులు పరిశీలించారు. ఈ సముదాయాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. కొందరు ఎక్కువగా పాల ఉత్పత్తులు, సంపూర్ణ ధాన్యాలు తీసుకుంటుండగా, మరికొందరి ఆహార విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఈ పరిశీలనలో ఆహారపు అలవాట్లకు, గట్‌లో నివసించే బ్యాక్టీరియా లక్షణాలకు మధ్య ఆసక్తికరమైన సంబంధం కనిపించింది.

**ఆహారాల్లో తేడాలే కారణం..**

తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు గట్‌లోని బ్యాక్టీరియాపై ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతున్నట్లు పరిశోధన సూచించింది. సాధారణంగా కనిపించే బిఫిడోబ్యాక్టీరియం అడోలెసెంటిస్ వంటి బ్యాక్టీరియాలోనూ పాశ్చాత్య దేశాల ప్రజల గట్ నమూనాల్లో అరుదుగా కనిపించే కార్బొహైడ్రేట్ ప్రాసెసింగ్ జన్యువులను గుర్తించారు. అంటే భారతీయుల సంప్రదాయ ఆహారంలో ఉండే కొన్ని పదార్థాలను జీర్ణం చేసుకోవడానికి ఇక్కడి గట్ బ్యాక్టీరియా కాలక్రమేణా ప్రత్యేకంగా అనుకూలించి ఉండే అవకాశం ఉంటుంది. బార్లీ, గోధుమలు, సంప్రదాయ పాల ఉత్పత్తులు వంటి ఆహార పదార్థాలను జీర్ణం చేసుకోవడంలో సహాయపడే కొన్ని ప్రత్యేక లక్షణాలు స్థానిక బ్యాక్టీరియాలో కనిపించినట్లు పరిశోధన వెల్లడించింది. దీని ద్వారా మనం తీసుకునే ఆహారం కేవలం మన శరీరాన్నే కాకుండా, మన గట్‌లో నివసించే సూక్ష్మజీవుల సముదాయాన్ని కూడా ప్రభావితం చేస్తుందని అర్థమవుతోంది.



ఇప్పటివరకు మార్కెట్లో లభించే అనేక ప్రోబయోటిక్ ఉత్పత్తుల్లో యూరప్, ఉత్తర అమెరికా వంటి పాశ్చాత్య ప్రాంతాల ప్రజల్లో గుర్తించిన బ్యాక్టీరియా స్ట్రెయిన్లను ఉపయోగిస్తున్నారు. మంచి బ్యాక్టీరియాగా పరిగణించే ఒక స్ట్రెయిన్ ఎక్కడి వ్యక్తి గట్‌లోకి వెళ్లినా ఒకే విధంగా పనిచేస్తుందనే ఆలోచన దీనికి కారణం. అయితే తాజా పరిశోధన ఈ విధానాన్ని మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

**ప్రోబయోటిక్స్ ఆపేయాలా..**

ఒక నిర్దిష్ట ఆహార విధానానికి, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా అభివృద్ధి చెందిన బ్యాక్టీరియా మరో రకమైన ఆహారపు అలవాట్లు ఉన్న వ్యక్తి గట్‌లోకి వెళ్లినప్పుడు అదే స్థాయిలో స్థిరపడవు. అలాగే అక్కడ ఉన్న సూక్ష్మజీవుల సముదాయంతో కలిసి అదే విధంగా పనిచేయవు. అందువల్ల ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సమాన ప్రయోజనం ఇస్తుందనే భావనను పరిశోధన ప్రశ్నిస్తోంది. అయితే దీనర్థం మార్కెట్లో లభించే ప్రోబయోటిక్స్ అన్నింటినీ వెంటనే ఆపేయాలని కాదు. ప్రోబయోటిక్స్ అనే భావనను తిరస్కరించడం కంటే, ఏ బ్యాక్టీరియా స్ట్రెయిన్ ఎవరికి, ఏ ఆహార విధానం ఉన్న వ్యక్తులకు, ఏ గట్ మైక్రోబయోమ్ నేపథ్యంలో ఉపయోగపడుతుందనే అంశంపై మరింత పరిశోధన అవసరమని ఈ పరిశోధన సూచిస్తోంది. భారతీయుల గట్‌కు అనుగుణంగా స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లను గుర్తించి, వాటిపై పరిశోధనలు చేసి, అవసరమైన పరీక్షలు నిర్వహించి ప్రోబయోటిక్ ఉత్పత్తులను అభివృద్ధి చేసే అవకాశం భవిష్యత్తులో పెరుగుతుంది. ముఖ్యంగా భారతీయుల సంప్రదాయ ఆహార విధానాలు, స్థానిక ఆహార పదార్థాలు, గట్‌లో ఇప్పటికే ఉన్న సూక్ష్మజీవుల సముదాయాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించే విధానాలు మరింత ఉపయోగకరంగా ఉంటాయనే ఆలోచనకు ఈ పరిశోధన బలం చేకూరుస్తోంది.

**ఒక్క ట్యాబ్లెట్ కీలకం కాదు..**

గట్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక్క ప్రోబయోటిక్ సప్లిమెంట్‌పైనే ఆధారపడాల్సిన అవసరం లేదని కూడా ఈ అంశం గుర్తుచేస్తోంది. వైవిధ్యమైన, పీచు పదార్థాలు అధికంగా ఉండే సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవడం గట్‌లోని సూక్ష్మజీవుల వైవిధ్యానికి అనుకూలంగా ఉంటుంది. ఒక నిర్దిష్ట ప్రోబయోటిక్‌ను కేవలం ప్రకటనలు లేదా మార్కెటింగ్ ఆధారంగా ఎంచుకోవడం కంటే, అవసరం ఉంటే వైద్య నిపుణుల సలహాతో తీసుకోవడం మంచిది. దేశంలోని గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌పై జరిగిన ఈ పరిశోధన దేశంలో ఇప్పటివరకు పెద్దగా గుర్తించని సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. భవిష్యత్తులో మరిన్ని స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లపై పరిశోధనలు జరిగితే భారతీయుల ఆహార విధానం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన ప్రోబయోటిక్స్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అంటే విదేశాల్లో అభివృద్ధి చేసిన ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సరిపోతుందా అనే ప్రశ్నకు బదులుగా, వ్యక్తి ఆహారం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా సరైన బ్యాక్టీరియాను ఎంచుకోవడంపై భవిష్యత్తు పరిశోధనలు దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.